JAYABHERIDAILY.COM

తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 30-11-2025

Medchal - Malkajgiri | Sunday 30-11-2025

jayabherinews

సంపుటి : 02 | సంచిక : 184 | పేజీలు : 8 | వెల : 5

Vol. 02 | Issue 184 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com






# ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- తరలిరండి – ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి
- ప్రపంచ ప్రముఖులకు ఆహ్వానాలు పంపిన ప్రభుత్వం
- డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ సదస్సు నిర్వహణ

**జయభేరి, హైదరాబాద్ :**

తరలిరండి – ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి.. అన్న నినాదంతో ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్కు ప్రపంచంలో పేరొందిన ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, టెక్నాలజీ రంగ నిపుణులు హాజరుకానున్నారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైదరాబాద్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. ఇందుకోసం దేశ విదేశాలకు చెందిన

...మిగతాది 2 లో

# విద్యుత్ ఉంటేనే అభివృద్ధి



**జయభేరి, హైదరాబాద్ నవంబర్ 29:**

స్పష్టమైన అవగాహనతో విద్యుత్ రంగంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చేరాలని

...మిగతాది 2 లో



# బలపడనున్న భారత్.. రష్యా రక్షణ సహకారం

**జయభేరి, న్యూఢిల్లీ, నవంబర్ 29:**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు సిద్ధమవుతున్న వేళ మాస్కో ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో కుదుర్చుకున్న సైనిక సహకార ఒప్పందాన్ని రష్యా పార్లమెంట్‌లో ఆమోదించేందుకు రంగం సిద్ధమైంది. పుతిన్ పర్యటనకు కొన్ని రోజుల ముందే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ ఏడాది ప్రారంభంలో రక్షణ రంగంలో సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఇరు దేశాల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. మాస్కోలో జరిగిన కార్యక్రమంలో రష్యా రక్షణ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్, ఆ దేశంలో భారత రాయబారి వినయ్ కుమార్‌లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇప్పుడు దీనికి చట్టబద్ధత కల్పిస్తూ రష్యా పార్లమెంట్ ఆమోదముద్ర వేయనుంది.

దీంతో ఇరు దేశాల మధ్య సైనిక బంధం మరింత బలోపేతం కానుంది.ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు డిసెంబర్ 4, 5 తేదీల్లో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా పుతిన్, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన గౌరవార్థం ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నారు. ఈ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య మరిన్ని కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# అమరావతిలో కృష్ణమ్మకు నిత్య హారతి

**జయభేరి, విజయవాడ, నవంబర్ 29:**

అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఆలయం క్లీన్, గ్రీన్, హైజినిక్‌గా ఉండటంతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అన్నప్రసాదం భవనాన్ని విస్తరించాలని చెప్పారు. ఇక కృష్ణమ్మకు నిత్యహారతి ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. కాగా, విస్తరణలో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 7 అంతస్తుల్లో మహా రాజగోపురంతో పాటు మూడు రాజగోపురాలు నిర్మించనున్నారు. భక్తులు, వీఐపీల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.దేవతల రాజధానిగా సీఎం చంద్రబాబు అభివర్ణించిన అమరావతిలో దేవదేవుడి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబువుతోంది. అమరావతిలోని వెంకటపాలెం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్‌ను చంద్రబాబు పరిశీలించారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయం క్లీన్, గ్రీన్, హైజినిక్ మోడల్ ఉండాలని చెప్పారు. ఆలయ నిర్మాణాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడాలని.. అమరావతికి

...మిగతాది 2 లో



చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెసిఆర్ తెలిపారు. తెలంగాణ కోసం చేసే ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకెళ్లింది మాజీ సిఎం కెసిఆర్ అని కొనియాడారు. తెలంగాణలో బిఆర్ఎస్ దీక్షా దివాస్ నిర్వహించారు. కెసిఆర్ తెలంగాణ దీక్షకు 16 ఏళ్లు గడిచినందుకు తెలంగాణ భవన్ లో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు.

# కాంగ్రెస్ పార్టీ కుట్రలు.. కుతంత్రాలు చేస్తోంది

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 29 :**

తెలంగాణ కోసం పదవులు సైతం ఆయన వదిలేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోందని విమర్శించారు. కౌరవులను కొట్టి మళ్లీ అధికారం లోకి వస్తామని, తెలంగాణ సంకెళ్లు తెంచిన నాయకుడు కెసిఆర్ అని తెలియజేశారు. ఉద్యమకాలంలో సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని బలి దేవత అని తిట్టారని కెటిఆర్ పేర్కొన్నారు. కెసిఆర్ దీక్ష స్ఫూర్తితో పోరాడతామని, తెలంగాణకు మొదట్నుంచి కాంగ్రెస్ విలన్ అని మండిపడ్డారు. కెసిఆర్ ఏడాదిన్నరగా బయటకు రావట్లేదని అంటున్నారని, గోడకు వేలాడదీసిన తుపాకీ కూడా సైలెంట్‌గా ఉంటుందని అన్నారు. కానీ.. బయటకు వచ్చినప్పుడు ఎలా పేలుతుందో తెలుస్తుందని సూచించారు. ఇప్పుడున్న సిఎం రేవంత్ రెడ్డి కెసిఆర్ పేరు లేకుండా ఒక్క ప్రసంగం చేశారా? అని ప్రశ్నించారు.

నాయకుడు ఎప్పటికైనా నాయకుడే.. అర్భకుడు ఎప్పటికైనా అర్భకుడే అని ఎద్దేవా చేశారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి వస్తే సంగతి తెలుస్తుందని, తెలంగాణ తల్లిని అవమానించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీసి కాంగ్రెస్ తల్లిని పెట్టారని, తెలంగాణ తల్లి స్థానంలో రాహుల్ గాంధీ తండ్రిని పెట్టారని దుయ్యబట్టారు. కాళేశ్వరం కాంగ్రెస్ కు శాపం కావచ్చు.. తెలంగాణకు మాత్రం వరం అని.. మేడిగడ్డ ఆనకట్టకు బాంబులు పెట్టి పేల్చే ప్రయత్నం జరిగిందని కెటిఆర్ ధ్వజమెత్తారు.

# న్యూయార్క్ లో అరకు కాఫీ




**జయభేరి, న్యూయార్క్, నవంబర్ 29:**

మన్యం అరకు కాఫీ ఇప్పుడు ప్రపంచంలోనే సూపర్ బ్రాండ్‌గా మారుతోంది. అరకు కాఫీ.. ప్రపంచవ్యాప్తంగా తన సుగంధాన్ని వ్యాపింపజేస్తూ మరో మైలురాయిని అడుగుపెట్టింది. అరకు ఒరిజినల్స్ ప్రపంచంలోనే తమ ఆరో ఔట్‌లెట్‌ను బెంగళూరులో ఘనంగా ప్రారంభించింది. అశోక్ నగర్‌లోని కమిషనరేట్ రోడ్డులో ఈ కొత్త కేఫ్ ప్రారంభమయింది. ప్యారిస్‌లో మూడు, ముంబైలో ఒకటి, బెంగళూరులో ఇప్పటికే ఒకటి ఉండగా.. ఇది బెంగళూరులో రెండో ఔట్‌లెట్ కావడం విశేషం. అంటే మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఆరు అరకు కేఫ్‌లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. త్వరలో న్యూయార్క్ లో ఔట్ లెట్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా తన సోషల్ మీడియా ఖాతాలో ప్రకటించారు.

...మిగతాది 2 లో

# బ్రేక్ ఫాస్ట్ మీటింగ్.. అలా ముగిసింది



**జయభేరి, బెంగళూరు, నవంబర్ 29:**

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య – డిప్యూటీ సీఎం మధ్య నెలకొన్న అధికార పోరుకు తాత్కాలికంగా తెరపడినట్లు కనిపిస్తోంది. శనివారం ఉదయం వీరిద్దరూ కలిసి నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ అనంతరం, ఇరువురు నేతలు తాము రాజీకి వచ్చినట్లు ప్రకటించారు. రాజకీయ విశ్లేషకులు ఈ భేటీని కాంప్రమైజ్ మీటింగ్‌గా అభివర్ణించారు. సమావేశం తర్వాత ఇద్దరు నేతలు తమ మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని స్పష్టం చేశారు. హైకమాండ్ ఎలాంటి

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

దాదాపు 3 వేల మంది ప్రముఖులకు ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయ స్థాయి సీఈఓలు సదస్సుకు హాజరవుతున్నట్టు ఇప్పటికే సమాచారం పంపించారు. యూఏఈ రాజవంశానికి చెందిన, ఎమిరేట్స్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్స్ డైరెక్టర్ షేక్ తారిక్ బిన్ ఫైజల్ అల్ ఖసిమి, రస్ అల్ ఖైమా ప్రతినిధులు, డుయిష్ బోర్సే గ్రూప్ హెడ్ లుడ్విగ్ హింజెల్మన్, ఎనిషన్ వ్యవస్థాపక భాగస్వామి విన్సన్, మాండయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ గ్రూప్ సీఈఓ బెన్నెట్ నియో తో పాటు పలు టెక్ కంపెనీల సీఈవోలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ సదస్సులో పాల్గొనడానికి ఇప్పటికే సంసిద్ధతను తెలియజేశారు.

2047 నాటికి వికసిత్ భారత్ జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక పత్రం తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్మ్యాప్ను రూపొందించింది. ఈ లక్ష్యాలను.. ప్రభుత్వం సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 ను నిర్వహిస్తున్నాం. తప్పకుండా తరలిరండి..' అని ముఖ్యమంత్రి పేరిట సందేశంతో ఆహ్వాన లేఖలు పంపించారు. తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించడం, పెట్టుబడులకు గమ్యస్థానంగా రూపొందిన ఇక్కడి వాతావరణం, విధానాలు, స్పష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర అభివృద్ధి సాధన అంశాలను ఈ వేదికగా చాటి చెప్పాలని ప్రభుత్వం సంకల్పించింది. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. తర్వాత ఈనెల 13న ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజం, గ్రెటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ GOAT లయనెల్ మెస్సీ హైదరాబాద్కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్ బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలువనుంది.

## విద్యుత్ ఉంటేనే అభివృద్ధి

తీర్చిదిద్దుతున్నామని, సిఎం రేవంత్ రెడ్డి కేబినెట్ సహచరులు కలిసి నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. తెలంగాణను ప్రపంచస్థాయి నగరంగా, రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని భట్టి అధికారులకు సూచించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చేరడానికి పెట్టుబడులు రావాలని, ఉత్పత్తి రంగాలు అభివృద్ధి చెందితేనే ఆశించిన స్థాయిలో ఎకానమీ ఉంటుందని పేర్కొన్నారు. ఆ దిశగా విద్యుత్ తయారు చేసుకోవాలని ప్రణాళికలు చేస్తున్నామని, పదేళ్లుగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 10 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందని, 2014లో పవర్ డిమాండ్ లో 6,755 మెగావాట్లు ఉండేదని చెప్పారు. 2025లో 18,138 మెగావాట్లకు పెరిగిందని, 2034 నాటికి 39,229 మెగావాట్లకు, 2025 నుంచి ప్రతి ఏటా 8.50 శాతం పెరుగుతుందని అన్నారు. 2047 నాటికి ప్రతి ఏటా 10 శాతం పవర్ గ్రోత్ అవసరం ఉంటుందని, విద్యుత్ ఉంటేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్ గ్లోబల్ హబ్ కు మారబోతోందని, 2047 నాటికి లక్ష మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని గుర్తుచేశారు. విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలని, ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి 24,760 మెగావాట్లు అని..విద్యుత్ స్టోరేజ్ పై ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు చేయలేదని చెప్పారు. విద్యుత్ ను బ్యాటరీ స్టోరేజ్, పంప్ డ్ స్టోరేజ్ ల్లో అందుబాటులోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. రాష్ట్రంలో 12 ప్రాంతాల్లో పంప్ డ్ స్టేరేజ్ పాయింట్లకు అవకాశం ఉందని, పంప్ డ్ స్టోరేజ్ కు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రం అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## అమరావతిలో కృష్ణమ్మకు నిత్య హారతి

వేంకటేశ్వర ఆలయం అదనపు ఆకర్షణ కావాలన్నారు. ప్రస్తుతం వెయ్యి మందికి సరిపోయేలా నిర్మిస్తున్న అన్నప్రసాదం అందించే భవనం.. భవిష్యత్తులో 20 వేల మందికి సరిపోయేలా విస్తరించేలా ప్లాన్ ఉండాలని తెలిపారు. అందుకు అనుగుణంగా పునాది పనులు చేపట్టాలని సూచించారు. ఆలయ చేపట్టిన అన్ని నిర్మాణాల్లోనూ ఇదే విధానంతో ముందుకు వెళ్లాలని తెలిపారు.ఆలయ నిర్మాణ పనులు రెండు దశల్లో చేపట్టే ప్రతిపాదనలు ఏం వద్దని.. ఒకే దశలో అన్ని చేపట్టాలని చంద్రబాబు సూచించారు. తిరుమల శ్రీవారి ఆలయ తరహాలోనే.. వాస్తు పరిమితికి లోబడి నిర్మాణాలు ఉండాలని చెప్పారు. కృష్ణా నదికి అభిముఖంగా రెండెకరాల్లో 50 కాటేజీలు నిర్మించాలని.. నిత్య పూజలు, భజనలు ఉండాలన్నారు. అంతేకాకుండా ఆలయం పక్కనున్న కృష్ణా నదిలో..గంగా హారతి మాదిరిగా.. సాయంత్రం కృష్ణమ్మ నిత్యం హారతి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు.ఆలయ ప్రాంగణంలో ధ్యాన మందిరాన్ని నిర్మిస్తారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో కలిపి దీన్ని నిర్మిస్తారు. ఇందులో ఎగ్జిబిషన్ హాళ్లు ఉండనున్నాయి. ఇక భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు వీలుగా డైనింగ్ హాల్, కిచెన్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం.. హెల్ప్ డెస్క్లు, కల్యాణ కట్ట, డార్మెటరీలు, లాక్ రూమ్, 3 వెయిటింగ్ హాల్స్ నిర్మిస్తున్నారు.


ఇక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్లో వివిధ సేవలకు టికెట్లు అందించేందుకు రిజిస్ట్రేషన్ కౌంటర్లు, సిబ్బందికి గదులు, ప్రథమ చికిత్స గది ఏర్పాటు చేస్తారు. 12 మంది ప్రధాన అర్చకులకు, 12 మంది సిబ్బందికి క్వార్టర్లు నిర్మిస్తారు. అలాగే ఎవరైనా విశిష్ట అతిథులు వస్తే బస, విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా.. ఓ విశ్రాంతి భవనాన్ని నిర్మించనున్నారు. అందులో రెండు వీవీఐపీల సూట్స్, 3 వీఐపీ సూట్స్, డైనింగ్ హాల్, సమావేశ గది, ఏసీ సదుపాయంతో 20 గదులు, వీఐపీ లాబీ, కిచెన్, ప్యాంట్రీ, రిసెప్షన్ వంటి అన్ని సౌకర్యాలు ఉండనున్నాయి.భక్తులకు ప్రసాదాలు అందించడానికి 8 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా 3 ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రకాశ్ ఉద్యానంలో లేజర్ షో ఏర్పాటు చేయనున్నారు. ఆలయ గోడలు, అంతర్గత రహదారులు, ప్రధాన ముఖద్వారం నిర్మించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు.ఆలయం తూర్పు వైపు 110 అడుగుల ఎత్తున, 7 అంతస్తుల్లో మహా రాజగోపురం నిర్మిస్తారు. మిగతా 3 వైపులా 60 అడుగుల ఎత్తుతో ఐదు అంతస్తుల్లో రాజగోపురాలు నిర్మించనున్నారు. కల్యాణ మండపం, అద్దాల మండపం, రథ, ఆర్జి, వాహన వంటి సేలవకు ప్రత్యేక మండపాలు, పుష్కరిణి కూడా నిర్మించడానికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. అయితే ఈ పనులు ఇప్పటి టెండర్లు ఆహ్వానించి గుత్తేదార్లను ఎంపిచ చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

## అలా ముగిసింది

నిర్ణయం తీసుకున్నా, దానికి కట్టుబడి ఉంటామని సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ప్రకటించారు.ఈ క్రమంలో ఈ ఇద్దరు నేతలు కీలక వ్యాఖ్యలు చేశారు. నెల రోజులుగా పార్టీలో గందరగోళం సృష్టించడానికి కొందరు ప్రయత్నించారని, అయితే తమ మధ్య విభేదాలు లేవని సీఎం సిద్ధరామయ్య అన్నారు. ''నెల రోజులుగా కొందరు కావాలనే గందరగోళాన్ని సృష్టించారు. ప్రతిపక్షాలు ఎంత ప్రయత్నం చేసినా, మా ప్రభుత్వాన్ని కూల్చలేరు. మాకు అధిష్టానం నిర్ణయమే ముఖ్యం'' అని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ ఏకైక లక్ష్యం 2028లో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ గెలిపించడమేనని ఇరువురు నేతలు ప్రకటించారు.ఇద్దరు నేతలు ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని పైకిచెబుతున్నప్పటికీ.. లోపల ఎవరి ప్రయత్నాల్లో వారున్నారని కొంతమంది వాదిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్లే అవకాశం ఉంది. సీఎం మార్పు అంశంపై అధిష్ఠానం ఆయనతో కీలక చర్చలు జరపనుంది. కాగా సీఎం మార్పుపై గత కొద్ది రోజులుగా ఇరువర్గాల నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ సంయుక్త ప్రకటన పార్టీలో గందరగోళానికి తాత్కాలికంగా తెరదించే అవకాశం ఉంది. రాజీ ఫార్ములా ప్రకారం, సిద్ధరామయ్య ప్రభుత్వం నిర్ణీత కాలం పాటు కొనసాగుతారా..? లేదా డీకేఎస్కు భవిష్యత్తులో ముఖ్యమంత్రి పదవి దక్కుతుందా అనేది హైకమాండ్ డిసైడ్ చేయనుంది.

# కన్నడలో కుర్చీలాట

కర్ణాటక రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మొన్నటిదా కా అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉన్నామని అటు సీఎం సిద్ధరామయ్య.. ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గంభీరంగా పేర్కొన్నప్పటికీ లోలోపల మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. హైకమాండ్ మాటకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్న డీకే శివ కుమార్ తాజాగా తన 'ఎక్స్' ఖాతాలో 'ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడ మే ప్రపంచంలో పెద్ద శక్తి' అని ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్గా సిద్ధరామయ్య.. 'మేము కర్ణాటకకు ఇచ్చిన మాట కేవలం నినాదం కాదు.. అదే మాకు సర్వస్వం' అని ట్వీట్ చేశారుఈ పరిణామాల నేపథ్యంలోనే కన్నడ రాజకీయం ఢిల్లీకి మారింది.



2023లో కర్ణాటకకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీకి మించి 23 సీట్లు అధికంగా సాధించి కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చింది. కర్ణాటకలో కాంగ్రెస్ విజయానికి సిద్ధరామయ్యతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడైన డీకే శివకుమార్ శక్తికి మించి పనిచేశారు. దీంతో ఐదేళ్ల పాలనలో రెండున్నరేళ్లు పూర్తి కాగానే అధికార మార్పిడి జరగాలని ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు సిద్ధరామయ్య ఈ ఏడాది నవంబర్ వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి ఆ తర్వాత సీఎం పగ్గాలను డీకేకు అప్పగించాలికానీ సిద్ధరామయ్య పార్టీ కేంద్ర నాయకత్వంతో భేటీ అయ్యి ఐదేళ్లు తానే సీఎంగా ఉండేలా అనుమతులు తెచ్చుకోవడంలో తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ కూడా సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్ధంగా లేరనిపించింది. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో డీకే పాత్ర మరువలేనిది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అన్ని వర్గాలను కలుపుకుని పోయి సమన్వయంతో వ్యవహరించి పార్టీని విజయపథంలో నడిపించారు. అయితే అపార పరిపాలన అనుభవం కలిగిన సిద్ధరామయ్యకే సీఎం పదవి ఇచ్చేందుకు అధిష్ఠానం మొగ్గుచూపింది.హైకమాండ్ ఆదేశాలను తాను శిరసావహిస్తానని డీకే చెప్పడంతో సమస్య చల్లబడినట్లుగా అనిపించింది. ఈ నవంబర్ 20తో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావడంతో అధికార మార్పిడి అంశం మరోసారి తెరమీదకు వచ్చింది.

శివకుమార్ను పొలిటికల్ మాస్టర్ మైండ్గా అభివర్ణించినప్పటికీ.. పాలన విషయంలో సిద్ధరామయ్య ఒక మెట్టు ముందు ఉంటారు. జనతాదళ్ నుంచి బహిష్కరణకు గురై 2006లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సిద్ధరామయ్య పార్టీలో అగ్రస్థానానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య , డీకే శివకుమార్ మధ్య పోరు కొనసాగుతుండగా ఉప ముఖ్యమంత్రికి పదోన్నతి కల్పించాలని కోరేందుకు ఆయన మద్దతుదారులు ఢిల్లీకి క్యూ కడుతున్నారు. కాగా పార్టీ అధిష్టానం నిర్ణయిస్తే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య సోమవారం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన కొందరు ఎమ్మెల్యేలకు అదనంగా డీకే శిబిరానికి చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీ చేరుకోగా మరికొందరు కూడా హస్తిన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని, దాన్ని తనతోపాటు డిప్యూటీ సీఎం కూడా అంగీకరించక తప్పదని సిద్ధరామయ్య విలేకరులకు చెప్పారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాం.నవంబర్ 20వ తేదీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి మార్పు జరగవచ్చని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి.

మరోవైపు తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానంటూ మాజీ కేపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర హోం మంత్రి జీ పరమేశ్వర ప్రకటించడం కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాటలు తనకు వేద వాక్యం లాంటివని శివకుమార్ సోమవారం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి జోరుగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తే తాను ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని, అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉండాల్సి ఉంటుందని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై సోమవారం విలేకరులు ప్రశ్నించినపుడు తాను కూడా ముఖ్యమంత్రి ప్రకటనతో ఏకీభవిస్తున్నానని డీకే చెప్పారు.2013లో కాంగ్రెస్ను అధికారంలోకి తీసుకురావడంతో పాటు సీఎంగా ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపించారు. ఇటు సిద్ధూ.. అటు డీకేల్లో ఉన్న ప్రత్యేక లక్షణాలే ఇవాళ హైకమాండ్కు సీఎం మార్పు తలనొప్పిగా మారిపోయింది. 2006లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.పాలనా ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్లు పూర్తయిన తర్వాత జేడీఎస్ అధినేత కుమారస్వామి అయిష్టంగానే సీఎం పదవి నుంచి తప్పుకొని ఆ బాధ్యతలు బీఎస్ యడ్యూరప్పకు అప్పగించారు.

ప్రస్తుతానికి సీఎం సిద్ధరామయ్య పదవికి ఎలాంటి ముప్పు లేదని తెలుస్తోంది. కర్ణాటక రాష్టంలో ఓబీసీలదే రాజ్యమని కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలుసని నివేదికలు చెబుతున్నాయి ఆయనకు అహింద వర్గంతో పాటు పార్టీలోని 100 మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉంది. కాంగ్రెస్ పార్టీకి సభలో మొత్తం 137 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య అంగీకారం లేకుండా ముఖ్యమంత్రిని మార్చడం అనేది చాలా కష్టం.కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల సమాఖ్య కాంగ్రెస్ను హెచ్చరించింది. రాష్ట్ర యూనిట్ లో అంతర్గత కలహాల నేపథ్యంలో సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించడానికి ఏ ప్రయత్నం చేసినా అది పార్టీపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది.

మరోవైపు కర్ణాటక రాష్ట్ర వొక్కలిగ సంఘం కూడా ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్న ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్కు అన్యాయం జరిగితే.. వారు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించింది. ముఖ్యమంత్రిని మార్చాలని సిద్ధరామయ్య వర్గంపై ఒత్తిడి తెస్తే వారు అధిష్ఠానానికి పేర్ల జాబితాను సమర్పిస్తారని గత కొద్ది రోజులుగా మీడియా నివేదికలలో వెల్లడైంది. ఇందులో ఓ ప్రత్యామ్నాయంగా హోంమంత్రి జి.పరమేశ్వర్ పేరు ఉండవచ్చు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. సిద్ధరామయ్య వర్గం ఏ పరిస్థితులలోనూ డీకే శివకుమార్ను తమ బాస్గా అంగీకరించడానికి సిద్ధంగా లేదు.అయితే కొన్ని రోజులకే జేడీఎస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు రావడంతో ప్రభుత్వం కుప్పకూలింది. తాజా పరిస్థితుల్లో కాం గ్రెస్లో అలాంటి అవకాశం లేనప్పటికీ హైకమాండ్ సీఎం మార్పుపై ఆచితూచి అడుగులు వేయాల్సిన అవసరముంది.

## న్యూయార్క్ లో అరకు కాఫీ

ఆంధ్రప్రదేశ్ ఆరకు వేలీలో గిరిజన రైతులు పండించే 100% ఆర్గానిక్ అరేబికా కాఫీ.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన, అత్యుత్తమ రుచి గల కాఫీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ బ్రాండ్ను 2018 నుంచి ఇప్పుడు ఫ్రాన్స్ నుంచి భారత్ వరకు.. త్వరలో అమెరికా వరకు విస్తరిస్తోంది.బెంగళూరు కొత్త ఔట్ లెట్ లో ఆరకు సిగ్నేచర్ బ్లెండ్స్, సింగిల్ ఎస్టేట్ కాఫీలు, హ్యాండ్క్రాఫ్టెడ్ డెజర్ట్స్, గిరిజన ఆర్ట్ తో అలంకరించిన ఇంటీరియర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. "ఆరకు కాఫీ అంటే కేవలం కాఫీ కాదు.. అది ఒక గిరిజన సమాజం ఆర్థిక స్వావలంబన కథ. ప్రతి కప్పులోనూ ఆరకు పర్వతాల సుగంధం, గిరిజన రైతుల కష్టం ఉంటాయి" అని ఆరకు టీమ్ తెలిపింది. న్యూయార్క్ ఔట్ లెట్ ప్రణాళికలు ఇప్పటికే ప్రారంభమైనట్టు సమాచారం. 2026లో అక్కడ తమ మొదటి అమెరికన్ కేఫ్ తెరవనున్నట్టు ఆరకు ఒరిజినల్స్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ప్యారిస్లో ఆరకు కేఫ్లు సెలబ్రిటీలు, కాఫీ కానస్యూర్స్లో టాక్ ఆఫ్ ది టౌన్గా మారాయి. ఇక బెంగళూరు, ముంబై తర్వాత.. న్యూయార్క్లో ఆరకు సుగంధం వ్యాపించడం ఖాయం!2004లో స్థాపించిన నాంది ఫౌండేషన్కు అనంద్ మహీంద్ర చైర్మన్, లైఫ్ ట్రస్టీగా ఉన్నారు. ఈ సంస్థ ఆరకు వ్యాలీలోని గిరిజనులకు వ్యవసాయ శిక్షణ, సహజ వనరుల నిర్వహణ ఇచ్చి, కాఫీ పంటను ప్రోత్సహించింది. 25 సంవత్సరాల ప్రయత్నాలతో 1 లక్ష మంది గిరిజనులు ఆర్థికంగా స్థిరపడటానికి దారి తీసింది. నాంది నేతృత్వంలో ఆరకు కాఫీని బ్రాండ్గా రూపొందించారు. 2017లో అరకు గ్లోబల్ హోల్డింగ్స్ స్థాపనకు మహీంద్ర ముఖ్య పాత్ర పోషించారు. ఇందులో ఇన్ఫోసిస్ కోఫౌండర్ కృష్ణ గోపాలకృష్ణన్, డా. రెడ్డీస్ చైర్మన్ సతీష్ రెడ్డి, సోమా ఎంటర్ప్రైజెస్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ మగంటి వంటి వ్యాపారవేత్తలు భాగస్వాములు. ఈ వెంచర్ ప్యారిస్లో మొదటి రిటైల్ స్టోర్ తెరిచి, ఐరోపాలో విస్తరించింది. ప్రస్తుతం ఆరకు ఒరిజినల్స్ బోర్డు చైర్మన్గా మహీంద్ర కొనసాగుతున్నారు. అరకు కాఫీ అంటే భారతదేశం ఉత్తమ ఉత్పత్తులను ప్రపంచానికి అందించగల సామర్థ్యానికి ఉదాహరణ అని మహీంద్ర ఎప్పుడూ చెబుతుంటారు.

## విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు పెంచుకోవాలి

- మాజానికి మేలు చేసే సైన్స్ ప్రాజెక్టులను రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జయభేరి, కరీంనగర్:**



ఘనంగా ప్రారంభమైన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025 26 విద్యార్థులు ప్రకృతితో మమేకమవుతూ సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు, ప్రాజెక్టులు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈరోజు స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో 202526 సంవత్సర జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్పైర్ అవార్డ్స్ మనాక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గత 10 ఏళ్లుగా క్రమం తప్పకుండా మన జిల్లా నుండి సైన్స్ ఎగ్జిబిట్ లు రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం, అక్కడి నుండి జాతీయస్థాయికి ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. ఏ జిల్లాలో లేని విధంగా కరీంనగర్ లో సైన్స్ మ్యూజియం ఉందని, ప్రభుత్వ, ప్రైవేట్ పిల్లలు ఎవరైనా మ్యూజియం సందర్శించవచ్చని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా విద్యార్థులు బాలశాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని కాబట్టి విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని తెలియజేశారు. మన దేశం కోసం, మన ప్రజల కోసం ఏం మంచి చేయగలుగుతామో ఆ దిశగా ఆలోచించడమే ఆత్మ నిర్భర్ భారత్, వికసిత భారత్ లక్ష్యమన్నారు.

విద్యార్థులే దేశ భవిష్యత్తు కావున ఇప్పటి విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు, విలువలే భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. వ్యవసాయాభివృద్ధి, ప్లాస్టిక్ నివారణ, పునరుత్పాదక శక్తి, శాస్త్ర సాంకేతికత, నీటి సంరక్షణ, ఆరోగ్యం పరిశుభ్రత, గణిత నమూనాలు మొదలైన అంశాలలో ఈ విజ్ఞాన మేళ నిర్వహిస్తున్నామన్నారు. మన వనరులను కాపాడుకోవడం, నీరు, ఆహారం, విద్యుత్ శక్తి మొదలైన వాటిని వృధా చేయకపోవడం మన నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. విద్యార్థుల విజ్ఞాన శాస్త్ర ఆలోచనలు ప్రపంచ స్థాయిలోనే ఉండాలని ఏమీ లేదని, మన చుట్టూ ఉన్న స్థానిక సమస్యల గురించి ఆలోచించడం, వాటిని గుర్తించడం, వాటి పరిష్కారం దిశగా ఆవిష్కరణలు చేయడం విద్యార్థుల ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. సమస్య పెద్దది కాకముందే గుర్తించి, దాన్ని తొలి దశలోనే పరిష్కరించడం వల్ల దానివల్ల ఏర్పడే దుష్పరిణామాలని తొలగించుకోగలుగుతామని స్పష్టం చేశారు. ప్రకృతిని తల్లిలాగా చూసుకుంటే, ప్రకృతి కూడా మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. ప్రకృతితో మానవ జీవితం అనుసంధానించబడినప్పుడే నూతన ఆవిష్కరణలకు శాస్త్ర సాంకేతిక రంగ అభివృద్ధికి సార్ధకత ఉంటుందని ప్రకృతికి అనుగుణంగా జీవన విధానం ఏర్పరచుకొని భవిష్యత్ తరాలకు నూతన ఆవిష్కరణలను అందించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ మొండయ్య మాట్లాడుతూ. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నింటి నుంచి ఈ ప్రదర్శనలో భాగస్వామ్యం ఉండడం సంతోషదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలని, ఆలోచనల్,లో ప్రవర్తనలో వైజ్ఞానికత ఉండాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పాఠశాలల్లోని విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలను వినియోగిస్తూ విద్యార్థుల్లో శాస్త్రపరమైన ఆలోచనలు పెంపొందించడానికి కృషి చేయాలని సూచించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ. భారత ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, వారిని బాల శాస్త్రవేత్తలుగా రూపొందించడానికి ఇన్స్పైర్ పురస్కారాల పేరుతో అధిక నిధులు వెచ్చిస్తున్నదని, దానిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజం మొత్తం ఇంజనీరింగ్ వైపు, వైద్యరంగం వైపు మాత్రమే కాకుండా విజ్ఞాన శాస్త్రం వైపు కూడా దృష్టి సారించాలని, తద్వారా శాస్త్రవేత్తలుగా ఎదిగి భారతదేశ శాస్త్ర సాంకేతికతను మరింత ఉన్నత దిశకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో బాల వైజ్ఞానిక ప్రదర్శన కొరకు మొత్తం 807 సైన్స్ ఎగ్జిబిట్ లు, 126 ఇన్స్పైర్ మనక్ ఎగ్జిబిట్లు వచ్చాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏడు అంశాల్ని ప్రదర్శనకు పెట్టామని, ప్రతి అంశం నుంచి ఉత్తమంగా వచ్చిన ఒక ప్రదర్శనను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్.భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, కొత్తపల్లి మండల విద్యాశాఖాధికారి ఆనందం, అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

జయభేరి, శామీర్‌పేట్ :



తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం మున్సిపల్ నిధులతో రూ.55 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న పనులకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజీబ్ బుద్దిన్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కలిసి శంకుస్థాపన చేశారు. తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. శామీర్‌పేట్ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా అండర్ డ్రైనేజీ వ్యవస్థ అత్యవసరమైందని, మున్సిపల్ నిధులతో ఈ పనులను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. శామీర్‌పేట్ తూంకుంట ప్రాంతాల్లో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు ఈ పనులు ప్రారంభమైనందుకు సంతోషం వ్యక్తం చేస్తూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, కట్ట మైసమ్మ దేవాలయం చైర్మన్ మేకల మహేందర్ యాదవ్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాష్కీ శంకర్ గౌడ్, విలాసాగర్ అశోక్, మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు, దప్పు సాయిబాబా, వంగా రవీందర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# 14 కోట్లు నష్టపోయిన డాక్టర్

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 29:




సైబర్ నేరగాళ్లు ఓ వైద్యుణ్ని మోసం చేసి 14 కోట్లను స్వాహా చేశారు. అమ్మాయి పేరుతో చాట్ చేసి ట్రేడింగ్ చేస్తూ నిలువునా ముంచేశారు. చివరకు తాను మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించిన ఆ డాక్టర్ పోలీసులను సంప్రదించి వివరాలు అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్ నెంబర్లు, ఇతర సాక్ష్యాలు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఎన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నా, ఎంతలా హెచ్చరికలు చేస్తున్నా, ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉంటున్నా సరే సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏదో రూపంలో ప్రజలను మాయ చేసి ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఇలాంటి కేసు ఒకటి హైదరాబాద్‌లో వెలులోకి వచ్చింది. సోషల్ మీడియాలో ఏర్పడిన పరిచయం ఆ డాక్టర్‌కు 14 కోట్లు పోయేలా చేసింది. ట్రేడింగ్ పేరుతో ముందుగా లాభాలు చూపించి ఓ దశ దాటిన తర్వాత నిలువునా ముంచేశారు. ఈ మధ్య కాలంలో స్టాక్ మార్కెట్లు, ఇతర ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఏఐ టెక్నాలజీ పెరగడంతో దాని ఆధారంగానే ప్రజలను మోసం చేస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్‌ను కూడా ఇలానే మోసం చేశారు. సోషల్ మీడియాలో ఆయనకు మొదట ఓ రిక్వస్ట్ వచ్చింది. అందులో మోనిక పేరుతో రిక్వస్ట్ వచ్చింది. అందులో అందమైన యువతి ఫొటో ఉంది. రిక్వస్ట్‌కు ఓకే చెప్పరు డాక్టర్. తర్వాత వారి మధ్య చాలా కాలం చాటింగ్ నడిచింది. మధ్యలో బిజినెస్ ప్రస్తావన వచ్చింది. తనకు ట్రేడింగ్‌లో మంచి ఎక్స్‌పీరియన్స్ ఉందని చెప్పి మాయమాటలు చెప్పింది. వాటిని అంతగా నమ్మకం కుదరలేదు. కానీ చూద్దాంలే అని చెప్పి కాస్త తక్కువ పెట్టుబడితోనే మొదలు పెట్టారు. అంతే వాటికి భారీ లాభాలు వచ్చాయి. ఇలా వారు పంపించిన లింక్‌లు ఆధారంగా పెట్టుబడులు పెట్టారు. మొదట్లో లాభాలు రావడంతో పెట్టుబడి పెంచారు. అయితే ఒక స్థాయి దాటిపోయిన తర్వాత లాభాలు కనిపిస్తున్నాయి కానీ వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు వీలు లేకుండా పోయింది. అప్పటికే పెద్దగా నష్టాలు లేనందున వాటి గురించి డాక్టర్ పట్టించుకోలేదు. కానీ అటు నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. కొద్దిగా ట్యాక్స్ కట్టేస్తే ఆ డబ్బులు వస్తాయని కూడా చెప్పింది. దీన్ని కూడా పట్టించుకోలేదు. కానీ ఒత్తిడి పెరగడంతో డబ్బులు ఊరికే ఎందుకు వదులుకుంటారని చెప్పడంతో మనసు మెత్తబడింది. వారు చెప్పినట్టుగా పంపిన లింక్‌ల ద్వారా వాళ్లు చెప్పిన డబ్బులు పే చేశారు. అంతే అప్పటి వరకు తరచూ వచ్చే ఫోన్‌లు రావడం మానేశాయి. మోనిక కూడా స్పందించడం లేదు. దీంతో మోసపోయినట్టుగా భావించిన డాక్టర్ పోలీసులను ఆశ్రయించాడు. మొత్తంగా సైబర్ నేరగాళ్లకు 14కోట్లు ముట్ట చెప్పినట్టు తేలింది. వివరాలు తెలుసుకున్న పోలీసులు విచారణ మొదలు పెట్టారు.

# తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో..
## అన్న తెగువతో నాలుగు కోట్ల మంది ఏకం

జయభేరి, ఉప్పల్ :



తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక దీక్షను స్మరించుకుంటూ మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ కార్యాలయం - గండిమైసమ్మలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కెసిఆర్ చేసిన ఉద్యమ పోరాటం, గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. అన్న తెగువతో నాలుగు కోట్ల మందిని ఏకం చేసి, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని రాజకీయ వ్యవస్థలను ఒప్పించి మెప్పించి కుల మతాలకు అతీతంగా ఏకం చేసిన దీక్షా దివాస్ ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా దివస్ అని ఆయన అన్నారు. అరవై ఏండ్ల గాయాలు, వేదనలను తెలంగాణ కన్నీళ్లను తీర్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ గారు అని ఆయన తెలిపారు. గాలి, నీరు, నేల ఉన్నంత కాలం తెలంగాణలో కేసీఆర్ అనే మూడక్షరాలు పదిలం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన నామినేషన్ల పర్వం
## అర్ధరాత్రి దాకా నామినేషన్లు

- చివరి రోజు సర్పంచ్ లకు 162, వార్డు మెంబర్ లకు 575 నామినేషన్లు
- నేడు నామినేషన్ల పరిశీలన, 3న విత్ డ్రా.. తేలనున్న అభ్యర్థుల పోటీ సంఖ్య

జయభేరి, యాదగిరిగుట్ట:



స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా యాదగిరిగుట్ట మండలంలోని జరుగుతున్న మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకుగానూ నామినేషన్ల పర్వం ముగిసింది. డిసెంబర్ 11న జరిగే ఎన్నికల కోసం ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు యాదగిరిగుట్ట మండలంలోని 23 గ్రామపంచాయతీలు, 198 వార్డులకుగానూ సర్పంచ్ లకు 162, వార్డులకు 575 నామినేషన్లు దాఖలైనట్లు యాదగిరిగుట్ట ఎంపీడీవో నవీన్ కుమార్ తెలిపారు. మూడు రోజుల పాటు సాగిన నామినేషన్లలో తొలి రెండు రోజులు మందకొడిగా సాగినప్పటికీ చివరి రోజున నామినేషన్లు అధికంగా దాఖలైనట్లు తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ దాఖలుకు సమయమైనప్పటికీ ముందస్తుగా టోకెన్ తీసుకున్న అభ్యర్థులకు అర్ధరాత్రి దాకా 12:00గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగినట్లు అధికారులు తెలిపారు.

**నేడు పరిశీలన..**

సర్పంచ్, వార్డు మెంబర్ లకు దాఖలైన నామినేషన్ల పరిశీలన నేడు జరగనుంది. నామినేషన్లు స్వీకరించిన రిటర్నింగ్ అధికారులు ఆదివారం నామినేషన్ల పత్రాలను పరిశీలించి తప్పులు ఉన్న నామినే షన్లను (స్క్రూట్నీ)తొలగించనున్నారు. డిసెంబర్ 1న ఫిర్యాదులు స్వీకరించి ,2న పరిశీలించి, 3న మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల విత్ డ్రా అనంతరం పోటీలో ఉండే సర్పంచ్,వార్డు సభ్యుల సంఖ్యను అధికారులు తెలియజేయనున్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

- సాధారణ ప్రసవాలకే మొగ్గు చూపాలి
- జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి
- పలు స్కానింగ్ సెంటర్ల పరిశీలన

జయభేరి, కోరుట్ల, నవంబర్ 29 :

ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తామని అన్ని రకాల సేవలకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి అన్నారు.శనివారం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన గర్భిణీ మహిళలకు సేవలు ఏవిధంగా అందుతున్నాయని, వారికి ఎలాంటి ఇబ్బంది కలిగిన తమను సంప్రదించాలని వారికి సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని సేవలు గురించి గర్భిణీ స్త్రీలను అడిగి వారి సమస్యలపై ఆరా తీశారు.తల్లి పిల్లల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆశవర్కర్,ఏఎన్ఎం, సూపర్ వైసర్ ల పనితీరు గురించి తెలుసుకున్నారు. మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు కుడా నిర్వహిస్తామని తెలిపారు. గర్భిణీ స్త్రీలను,ప్రసవాలు జరిగిన వారిని కలిసి వసతుల గురించి ఆరాతీశారు.సమీక్ష సమావేశం నిర్వహించి అనంతరం అన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆనంతరం జిల్లా ఉప వైద్యాధికారి పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్ల తనిఖీ నిర్వహించి నామ్స్ ప్రకారం అన్ని నిబంధనలు పాటించాలని,లింగ నిర్ధారణ పరీక్షల సమయంలో గోప్యత పాటించాలని, అలాంటి గోప్యత పాటించకుంటే చట్టరీత్య కేసులు నమోదు చెస్తామని, వారు శిక్షార్హులేనని ఉప వైద్యాదికారి జైపాల్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరెండేంట్ సునీత రాణి, వైద్యురాలు చైతన్య సుధ, విజయలక్ష్మి, ఆర్ఎంవో వినోద్ కుమార్, రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ భూమేష్, శంకర్ సూపర్వైసర్ ధనుంజయ్, నాగభూషన్, ఫార్మాసిస్ట్ ఉదయ్ ప్రసాద్, రబ్బానీ రియాజ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# అందనంత ఎత్తులో వైట్, సిల్వర్ మెటల్స్

- 5 రోజుల్లో కేజీ వెండిపై రూ.21 వేలు పెరుగుదల

జయభేరి, ముంబై, నవంబర్ 29 :

బంగారం, వెండి ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం కొనాలనుకున్న వారికి షాకిస్తూ గోల్డ్ రేట్స్ చుక్కలనంటుతున్నాయి. వెండి వస్తువులు కొనాలనుకున్న వారి ఆశలు ఆశలుగానే మిగిలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా పెరుగుతున్న ధరలు చూస్తుంటే బంగారంతో పాటు వెండి కూడా అందని ద్రాక్షగా మారుతుందన్న ఆందోళన పెరుగుతోంది. ఇవాళ శనివారం (నవంబర్ 29న) ఒక్కరోజే బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.1,250 పెరిగి రూ.1,19,000కి చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,360 పెరిగి రూ.1,29,820 పలుకుతోంది.ఇక పసిడి బాటలోనే పయనించిన వెండి ధర ఆల్ టైం రికార్డుకు చేరింది. కేజీ వెండిపై ఏకంగా రూ.9,000 పెరగడంతో రూ.1,92,000 వద్ద ధర కొనసాగుతోంది. 5 రోజుల్లో కేజీ వెండిపై రూ.21 వేలు పెరిగింది. త్వరలోనే వెండి ధర రూ.2 లక్షలు దాటే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.




# కేసీఆర్ సంకల్ప బలానికి.. దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా దివస్

జయభేరి, కాప్రా :

దీక్షా దివాస్ సందర్భంగా రాధిక X రోడ్ వద్ద BRS పార్టీ డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కెసిఆర్ చేసిన ఉద్యమ పోరాటం, గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అన్న తెగువతో నాలుగు కోట్ల మందిని ఏకం చేసి, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని రాజకీయ వ్యవస్థలను ఒప్పించి మెప్పించి కుల మతాలకు అతీతంగా ఏకం చేసిన దీక్షా దివాస్ ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా దివస్ అని ఆయన అన్నారు. అరవై ఏండ్ల గాయాలు, వేదనలను తెలంగాణ కన్నీళ్లను తీర్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ గారు అని ఆయన తెలిపారు. గాలి, నీరు, నేల ఉన్నంత కాలం తెలంగాణలో కేసీఆర్ అనే మూడక్షరాలు పదిలం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, BRS పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పొరపాట్లు జరగకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు




జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 29:

యాదగిరిగుట్ట మండల పరిధిలోని నామినేషన్ దాఖలు కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. శనివారం యాదగిరిగుట్ట మండల పరిధిలోని మాసాయిపేట, పెద్దకందుకూరు,వంగపల్లి, దాతారుపల్లి గ్రామంలోని నామినేషన్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ఏ ఒక్కరూ ప్రవర్తించకుండా చూసుకోవాలని, అభ్యర్థి నామినేషన్ పత్రాలను పరిశీలించి స్వీకరించాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలు కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నాపై అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల్లో ఎవరైనా పోటీ చేయొచ్చని,నామినేషన్ వేసిన వారు విత్ డ్రా చేసుకోవాలంటే అది వారి ఇష్టమని, ప్రలోభాలకు పాల్పడితే మాత్రం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట యాదగిరిగుట్ట తహశీల్దార్ గణేష్ నాయక్, ఎంపీడీవో నవీన్ కుమార్, మాసాయిపేట, సైదాపురం, మైలారిగూడెం, కాచారం పంచాయతీ సెక్రటరీ నరేష్, రోజా, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు పరీక్షలపై శ్రద్ధ పెట్టాలి



జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 29:

విద్యార్థులు పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కష్టపడి చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్లో మొత్తం విద్యార్థులు ఎంతమంది ఉన్నారని పదోతరగతిలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని రోజు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదోతరగతిలో విద్యార్థులకు ఎంత మేరకు సిలబస్ పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నెలలో సిలబస్ మొత్తం పూర్తి చేయాలని డివిజన్ క్లాసులు మొదలు పెట్టాలని అన్నారు ఈ విద్యా సంవత్సరంలో కూడా 10వ తరగతి వార్షిక ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు విద్యార్థులు సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కేజీహెచ్ లో అగ్ని ప్రమాదం

జయభేరి, విశాఖపట్నం:

విశాఖలో షాకింగ్ ఘటన వెలుగు చూసింది.నగరంలోని కింజ్ జార్జ్ హాస్పిటల్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. హాస్పిటల్లోని కార్డి యాలజీ విభాగంలో ఒక్కసారి గా మంటలు చెలరేగాయి. దీంతో ఫ్లోర్ మొత్తం దట్టమైన పొగలు అలుము కున్నాయి. హాస్పిటల్ సిబ్బంది సమాచారంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలార్పుతున్నారు. మంటల చెలరేగడంతో హాస్పిటల్ లోని చాలా ఫ్లోర్లలో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో కొందరు పేషెండ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అయితే ఈ ప్రమా దంలో రోగులకు ఎటువంటి గాయా లు కాలేదని.. అందరూ సురక్షితం గా ఉన్నట్టు హాస్పిటల్ వర్గాలు చెబుతున్నాయి. ప్రమాదం కారణం గా హాస్పిటల్లోని కొన్ని వస్తువులు దగ్ధమయ్యాయని.. దాని కారణంగా కొంత మేర ఆస్తి నష్టం జరిగినట్టు తెలుస్తోంది.



## కెసిఆర్ దత్తత గ్రామంలో పాఠశాల దుస్థితి

**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 29 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దత్తత గ్రామంలో పాఠశాల దుస్థితి బాగోలేదని బాలల వర్కర్స్ పరి కర్త కమిషన్ సభ్యురాలు గోగుల సరిత అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు స్లాబ్ కింద చదువుకునే పరిస్థితి తెచ్చిన గత ప్రభుత్వం నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్టి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యే విధంగా చూస్తామని అన్నారు. ఇక్కడ చదివే పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సత్యనారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్సై సాయి కుమార్



**జయభేరి, గార్ల, నవంబర్ 29:**

మండల పరిధిలోని ముల్కనూర్, సత్యనారాయణపురం, చిన్నకి ష్ణాపురం, పెద్ద పెద్దకిష్టాపురం గ్రామపంచాయతీలలోనీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఎస్సై సాయి కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తామని గ్రామాలలో అనుమానీతులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అక్రమంగా మద్యం రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో మంచినీరు,విద్యుత్ సదుపాయం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అక్కడ స్థానిక ప్రజలతో మాట్లాడుతూ..సమస్యలు ఏమైనా ఉంటే పోలీసు వారితో పాలుపంచుకోవాలని అన్నారు. ఎలాంటి ఘర్షణలు లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు.

## మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి యజ్ఞం



**జయభేరి, కొండ మల్లేపల్లి :**


కొండమల్లేపల్లి మండలం పెండ్లి పాకాలలో ఆంజనేయ స్వాములు నిర్వహించిన శ్రీ మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి గాయత్రి మహా యజ్ఞం కార్యక్రమంలో పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వాముల తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లిరోజు సందర్భంగా ఆలయాలకు విరాళాలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ పెళ్లి రోజు సందర్భంగా దేవరకొండ పాత రామాలయం అన్న ప్రసాదానికి 5016/రూపాయలు, తుల్చమ్మ హనుమాన్ దేవాలయలం అన్న ప్రసాదానికి 5016/, శ్రీ మద్దెలమ్మ దేవాలయం అన్న ప్రసాదానికి 5016/విరాళం ఇవ్వడం జరిగింది. ఆలయం పూజారులు ఆలయం కమిటీ సభ్యులు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేసి శాలువల తో సత్కరించినారు. కాలని వాసులు అంజి గౌడ్ మా కాలనీకి అన్ని రకాలుగా అభివృద్ధి చేసినారు ఎప్పుడూ కాలనీ గురించి ఏ సమస్య వచ్చినా వెంటనే అధికారులకు చెప్పి సమస్యలు పరిష్కరిస్తాడని కాలనీ నివాసులు తెలియజేసినారు.

## ఆర్డీవో కి వినతి పత్రం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం దేవరకొండ పరిధిలో గల చెరువులు, కుంటలు మా సొసైటీలో పరిధిలో ఉన్నవి కానీ రజకులు నాయనోని కుంటలో చాప పిల్లలు పోసినారు మా సొసైటీలో ఉన్న గుంటలలో వేరే కులస్తులు సంబంధం లేదు రజకా కులస్తులు కుంట మాది అని దౌర్జన్యం చేస్తున్నారు గతంలో 2024 లో మా దగ్గర అన్ని పేపర్లు ఉన్నాయని అన్నారు కానీ ఇంతవరకు మత్స్యకారి సొసైటీకి చూపించలేదు మత్స్యకారి వాళ్ళ కులవృత్తులను భగ్నం కలిగిస్తున్నారు. మత్స్యకార సొసైటీ అధ్యక్షులు కొప్పరి శంకరయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాస మల్ల నాగయ్య, ప్రధాన కార్యదర్శి రెడ్డి శంకర్, జింకల రవి, A విజయ్, వెంకటయ్య, జింకల మధు, కొప్పెరి శ్రీను, నీలం వెంకటయ్య, నగేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిప్రదక్షిణ విజయవంతం చేయాలి

- గిరి ప్రదక్షణకు 20 నుంచి 30 వేల సాములు రాక అయ్యప్ప స్వాములకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు
- యాదగిరిగుట్ట అయ్యప్ప కొండ అయ్యప్ప సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ప్రకటన



**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 29:**

యాదగిరిగుట్ట దేవస్థానం వారి సహకారంతో ప్రతి సంవత్సరం నిర్వహించే అయ్యప్ప స్వాముల గిరి ప్రదక్షిణ. డిసెంబర్ 1న సోమవారం చేపడుతున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప స్వామి మాలదారులు యాదగిరిగుట్ట కొండ చుట్టూ గిరి ప్రదక్షణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాల ధారన భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట అయ్యప్ప స్వామి కొండ ట్రస్ట్ సభ్యులు అధ్యక్షులు సుదుగు శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాసులు గుప్తా, కోశాధికారి బింగి పాండు ,గురుస్వామి ర్యాకల రాజు శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని అయ్యప్ప కొండపైన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మట్లాడుతూ గిరి ప్రదక్షణకు ఒక రోజు ముందుగా వచ్చే అయ్యప్ప స్వాములకు యాదాద్రి దేవస్థానం వారు వసతితో పాటు గర్భాలయ దర్శనం లడ్డు ప్రసాదం అల్పాహారం కూడా అంద అందచేస్తున్నారని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న సుమారు ఇరవై వేల స్వాములు వస్తారని తెలిపారు. కొండ చుట్టూ భక్తి గీతాలతో మంగళ వాయిద్యాలతో పల్లకి సేవ ఊరేగింపుగా తీసుకువస్తామని అన్నారు. అధిక సంఖ్యలో మాల ద్వారా స్వాములు గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో కాశీ నుండి కన్యాకుమారి వరకు అదేవిధంగా అయ్యప్ప స్వామి శబరి మలై వెళ్లిన గోమాత ఇక్కడికి రానుందని తెలిపారు. ఆరోజున మరో శబరిమలగా యాదాద్రి మారడం ఉందని అన్నారు.

ఈ అయ్యప్ప స్వాముల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని రెండు తెలుగు రాష్ట్రాల నుండి భారీ ఎత్తున అయ్యప్ప స్వాములు భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు. గిరిప్రదక్షిణ తర్వాత అయ్యప్ప స్వాములకు ఉచితంగా యాదగిరిగుట్ట దేవస్థానం వారు స్వామివారి గర్భాలయ దర్శనంతో పాటు లడ్డు ప్రసాద్ ని ఉచితంగా అందజేయమన్నారని అన్నారు. ఒకరోజు ముందుగా వచ్చే అయ్యప్ప స్వాములకు వసతి సౌకర్యాన్ని కల్పించనుందామని అదేవిధంగా అల్పాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణతో పాటు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, అయ్యప్ప స్వాములకు ప్రత్యేకంగా పెద్ద ఎత్తున సహకరిస్తున్నారని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు తెలిపారు. గతంలో కూడా ఆయన అయ్యప్ప కొండకు అనేక రకాలుగా సేవలు అందించారని తెలిపారు. డిసెంబర్ 1న జరిగే ఈ గిరిప్రదర్శన కార్యక్రమాన్ని భక్తులందరూ విజయవంతం చేయాలని వారు కోరారు.

ఈ సమావేశంలో అయ్యప్ప కొండ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు సుదుగు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాసులు గుప్త, కోశాధికారి బింగి పాండు, గౌరవ సలహాదారులు మురారి శెట్టి నాగేశ్వరరావు, గురుస్వామి ర్యాకల రాజు, పెండెం శ్రీనివాస్, కూరపాటి విష్ణుమూర్తి సార కరుణాకర్, సుక్కల ఉప్పలయ్య, ఆంజనేయులు, బాలు, వేముల రవీందర్, సుదుగు రాజ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## టీయూ డబ్ల్యూజే ఐజేయు అధ్యక్షునికి ఘన స్వాగతం పలికిన జర్నలిస్టులు

- తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) (ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధం)

**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 29 :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మూడవ మహాసభ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్అలీ హాజరవుతున్న సందర్భంగా షాద్ నగర్ జర్నలిస్టుల ఆయనకు స్వాగతం పలుకుతూ శాలువా పూలమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యల పైన డిసెంబర్ 3వ తేదీన మహా ధర్నా గురించి చర్చించారు.అదేవిధంగా షాద్ నగర్ నియోజకవర్గ ప్రింట్ మీడియా అధ్యక్షులు బూర్గుల ఫణీంద్ర మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) అంటేనే జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యూనియన్ అని కొనియాడారు.3వ తేదీన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులను కోరారు. డిసెంబర్ మూడో తేదీన మహా ధర్నా చేపడుతున్న కరపత్రాన్ని విడుదల కార్యక్రమాన్ని త్వరలోనే అందరం కలిసి విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రమేష్, ఇలియాస్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, సంయుక్త కార్యదర్శిలు అల్వాల దర్శన్ గౌడ్, జగన్, సవాల రాజు, సమీ, శ్రావణ్ కుమార్ గౌడ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## అధికారులు అందరూ అందుబాటులో ఉండండి

- సాయం కొరకు టోల్ ఫ్రీ నంబర్లు 0877 - 2256776, 90008 22909 సంప్రదించండి.
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
- ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య.

దిత్వా తుఫాన్ నేపథ్యంలో రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురవనున్న తరుణంలో నగరంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే సాయం అందించేందుకు అన్ని విభాగాల అధికారులు అందుబాటులో అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులు, సిబ్బందికి కమిషనర్ దిశానిర్దేశం చేశారు. దిత్వా తుఫాన్ నేపథ్యంలో రెండు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా సాయం అందించేందుకు అందరు అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యాలయంలో 24గంటల పాటు టోల్ ఫ్రీ నంబర్లు 0877 - 2256776, 90008 22909 లో అందుబాటులో ఉంటారని తెలిపారు. కాలువల్లో ఎక్కడా మురుగునీరు ఆగి, రోడ్లపైకి రాకుండా చెత్త తొలగించాలని సిబ్బంది ని ఆదేశించారు. వర్షాల వలన త్రాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉంది కాబట్టి, నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పరీక్షలు నిర్వహించి, క్లోరినేషన్ చేయాలనీ తెలిపారు. ఎక్కడైనా నీటి కలుషితం జరిగితే సరఫరా ఆపి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ప్రజలు కాచి వాడగట్టిన నీరు తాగాలని తెలిపారు. మ్యానహోల్ ఓపెన్ చేసిన ప్రాంతాల్లో ను, అండర్ బ్రిడ్జిల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపునీరు ఆగకుండా మోటార్లతో నీరు పంపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. హోర్డింగులు, ఫ్లెక్సీలు కింద పడకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచంచారు. ప్రజలకు జబ్బులు ప్రబలకుండా ఏఎన్ఎంలు తగుచర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా చెట్లు పడేలా ఉన్నా, విద్యుత్ అంతరాయం ఏర్పడినా కంట్రోల్ రూమ్ ను సంప్రదించాలని తెలిపారు. పురాతన భవనాల్లో నివాసం ఉండొద్దని ప్రజలకు సూచించారు. నగరపాలక సిబ్బంది రైన్ కోట్లు, రేడియం స్టిక్కర్ జాకెట్లు ధరించి విధులు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.

## డిసెంబర్ 1 నుంచి కొత్త వైన్స్ షాపులు అదే నెలలో పంచాయతీ పోలింగ్ కిక్కు!



- లైసెన్సు ప్రారంభ రోజు నుంచే రాజకీయ బంపర్ ఆఫర్
- రెండు సంవత్సరాల లైసెన్సుకు స్టార్టింగ్ నుంచే భారీ డిమాండ్
- అభ్యర్థుల ముందస్తు డీల్స్ వ్యాపారులకు కోట్ల ఆశలు
- ఎక్సైజ్ శాఖ అప్రమత్తం డిపోల్లో భారీ స్టాక్ సిద్ధం
- మద్యం లైసెన్స్ లకు ఎన్నికల వరం



**జయభేరి, యాదగిరిగుట్ట:**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని మద్యం ఎన్నికల జోడీ కొత్తగా మద్యం లైసెన్సులు పొందిన వ్యాపారులకు అదృష్టం రెండు చేతులా కలిసి వచ్చినట్లు పరిస్థితి,డిసెంబర్ 1 నుంచి తాజా లైసెన్సులు అమల్లోకి రానుండగా,డిసెంబర్ నెలలో గ్రామ పంచాయతీతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతో మద్యం షాపులకు ఎన్నికల వసంతం వచ్చిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

**వైన్స్ షాపులకు బంగారు అవకాశం..**

యాదాద్రి జిల్లా పరిధిలో మొత్తం 82 మద్యం దుకాణాలకు రెండు సంవత్సరాల పాటు (2025 2027) టెండర్ల ద్వారా కేటాయింపులు పూర్తయ్యాయి. పాత లైసెన్సులు నవంబర్ 30తో ముగియగా,కొత్త వైన్స్ షాపులు డిసెంబర్ 1న ప్రారంభం కాబోతున్నాయి. నవంబర్ 28 శుక్రవారం నుంచే కొత్త లైసెన్సుదారులకు స్టాక్ కేటాయింపులు మొదలు కానున్నాయి.

**ఎన్నికల రష్ స్టాక్ పై పట్టు!**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారం నుంచి పోలింగ్ దాకా మద్యం డిమాండ్ భారీగా పెరుగుతుందనేది తెలిసిన నిజమే.దీన్ని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు ముందుగానే ఎక్కువ స్టాక్ నిల్వ చేసుకుంటున్నట్లు సమాచారం. అభ్యర్థులు తమ అనుచరులకు మద్యం అందించేందుకు గోప్ప ఒప్పందాలు ఎన్నికల తర్వాత కూడా మండల,జిల్లా పరిషత్ తదుపరి మున్సిపల్ ఎన్నికలు! ఇదే వరం ఇప్పుడు యాదాద్రి భువనగిరి జిల్లా మద్యం వ్యాపారులకు అందుకోంది. ఎన్నికల్లో డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో ఎక్సైజ్ శాఖ కూడా అప్రమత్తమైంది. ఎన్నికలు వస్తే ఓట్లు పోరు, కౌంటింగ్ తర్వాత మద్యం లాభాలే! అందుకే ఈసారి మద్యం వ్యాపారులకు లైసెన్సులు కాకుండా లక్కీ టికెట్లు దక్కాయి చెప్పవచ్చు.


## ఒక్కసారి ఆశీర్వదించండి.. అభివృద్ధి పరుగులు పెట్టిస్తా..

- చింతకుంట తండా సర్పంచ్ పదవికి నామినేషన్ శాఖలు వేసిన పాత్లావత్ శారద



**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 29 :**


రంగారెడ్డి జిల్లా జిల్లెడ్ చౌదరిగూడ మండలం చింతకుంట తండా గ్రామ పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా సర్పంచ్ పదవికి పాత్లావత్ శారద అధికారికంగా నామినేషన్ దాఖలు చేశారు. శారద తో పాటు ఆమె కుమారుడు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాష్ నాయక్ కూడా నామినేషన్ ప్రక్రియలో పాల్గొని మద్దతు తెలిపారు. నామినేషన్ దాఖలు అనంతరం శారద మాట్లాడుతూ...గ్రామంలో అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజాసేవే మా లక్ష్యం. చింతకుంట తండా గ్రామపంచాయతీ, మెట్టుగడ్డ తాండ , గోలబండ తండా వేపకుచ్చ తాండ సంపూర్ణ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని చెప్పారు. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారులు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటామని వివరించారు. చింతకుంటలో నామినేషన్ దాఖలు సందర్భంగా ఉత్సాహం నెలకొంది. ప్రజల ఆశలు అభీష్టాలకు నిలువెత్తు ప్రతినిధిగా నిలుస్తామన్న నమ్మకంతో పాత్లావత్ శారద ముందుకు సాగుతున్నారు. గ్రామ అభివృద్ధికి తాము ఓటుతో పాలుపంచుకుంటామని గ్రామస్థులు బారీగా మద్దతు తెలుపుతున్నారని స్పష్టం చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాష్ నాయక్ మాట్లాడుతూ.. యువత, మహిళలు, రైతుల సమస్యలు పరిష్కారమయ్యేలా గ్రామ పాలన ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలతో కలిసి, ప్రజల కోసం పని చేసే నిక్కసైన అభ్యర్థి శారద అభ్యర్థి అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువత, స్థానిక నాయకులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు..



# మంచు విష్ణు వ్యవహారంపై మా సభ్యుల అసంతృప్తి..

సినీ పరిశ్రమలో కీలక సంస్థ అయిన మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) శనివారం నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్ తీవ్ర చర్చలకు వేదికైంది. గత నాలుగేళ్లుగా మా అధ్యక్షుడిగా కొనసాగుతున్న మంచు విష్ణు పదవి కాలం ఇప్పటికే ముగిసినా, కొత్త మా భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు ఆయనే కొనసాగాలనే తీర్మానం చేశారట. దీని ప్రకారం ఇప్పటివరకు బాధ్యతల్లోనే ఉన్నారు. అయితే భవనం నిర్మాణంపై స్పష్టత లేకపోవడం వల్ల సభ్యుల్లో అసంతృప్తి పెరిగింది. సభలో పలువురు సభ్యులు భవనం నిర్మాణం ఎంతవరకు వచ్చిందన్న దానిపై స్పష్టమైన సమాచారాన్ని కోరగా, దీనిపై ఎలాంటి అప్డేట్ లేకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. భవనం నిర్మాణం పేరుతో అధ్యక్ష పీఠం ఆక్రమించుకుని ఉండడం సబబా అనే ప్రశ్నలూ వెల్లువెత్తాయి. చర్చల్లో పాల్గొన్న పలువురు సభ్యులు మంచు విష్ణు, ఆయన టీమ్‌పై అసంతృప్తిని వెల్లగక్కారు. ఇప్పటికే సభ్యుల పదవీ కాలం దాటిపోయినందున, తక్షణమే నూతన ఎన్నికలు నిర్వహించాలంటూ పలువురు బలంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే జనరల్ బాడీ మీటింగ్‌లో గత కాలంలో జరిగిన అన్ని ఆర్థిక లావాదేవీలను పరిశీలించాలి అన్నది ప్రధాన చర్చాంశంగా మారింది. మే నెలలో ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని నాయకత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇక ఈసారి ఎన్నికల్లో పోటీతీరు కాకుండా, ఏకగ్రీవంగా అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. సభలో జరిగిన చర్చల్లో భాగంగా, ఎవరైనా అగ్ర హీరో ముందుకు వస్తే, ఆయనను మా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సభ్యులు సిద్ధంగా ఉన్నట్లు టాక్. అయితే గతంలో జరిగిన రాజకీయాలు, వివాదాల నేపథ్యంలో అగ్ర హీరోలు ముందుకు వస్తారా అన్నదే పెద్ద ప్రశ్నగా మారింది. మరోవైపు మంచు విష్ణు ఈ చర్చలపై ఎలా స్పందిస్తారన్నది ఇంకా తెలియాల్సి ఉంది. మా భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు కొనసాగాలనే నిర్ణయాన్ని మార్చుకునే అవకాశం ఉందా? లేదా త్వరలోనే కొత్త ఎన్నికలు ప్రకటిస్తారా? అన్న అంశాలపై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది.

# ఇకనుంచి రాజమౌళి వారణాసి?



రాజమౌళి, మహేశ్‌బాబుల 'వారణాసి' సినిమా టైటిల్‌ను ఇటీవల ఓ భారీ కార్యక్రమంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అనాటి నుంచి ఈ టైటిల్‌పై పరిశ్రమలో వివాదం మొదలైంది. దానికి కారణం అదే పేరుతో మరొకరు అప్పటికే ఆ టైటిల్‌ని రిజిస్టర్ చేసి ఉండటమే. 'వారణాసి' అంటూ రాజమౌళి సినిమా టైటిల్ గ్లింప్స్, పోస్టర్ విడుదల కాగానే, సరిగ్గా అదే సమయంలో అప్పటికే ఆ టైటిల్ హక్కుదారులైన మరో సినిమా మేకర్స్ 'వారణాసి' టైటిల్‌తో తమ సినిమా పోస్టర్‌ని విడుదల చేశారు. దీంతో ఈ సమస్యను ఓ కొలిక్కి తెచ్చేందుకు పరిశ్రమలో పలు ప్రయత్నాలు జరిగాయి.

సదరు సినీ మేకర్స్‌తో చర్చలు కూడా జరిపారని వినికిడి. చివరకు.. మహేశ్, రాజమౌళి సినిమా టైటిల్‌నే మార్చాల్సొచ్చిందని టాక్. ఈ సినిమాకు 'రాజమౌళి వారణాసి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకచోప్రా కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. పృధ్వీరాజ్ సుకుమార్ ప్రతినాయకుడు పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి.



# ఈసారి కథ కొత్త.. స్కేల్ పెద్దది.. భారీ బడ్జెట్


టాలీవుడ్‌తోపాటు తన అందంతో బాలీవుడ్‌ని కూడా షేక్ చేస్తున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా! 'ఓదెల 2'సినిమాలో బోల్డ్ లుక్‌లో అదరగొట్టిన తమన్నా రాగిణి MMS3లో లీడ్ రోల్ ప్లే చేయడానికి సుముఖంగా ఉందని ఇన్‌సైడ్ టాక్. ఇంకా అధికారిక ప్రకటన రాలేదు, కానీ చర్చలు చాలా పాజిటివ్ దిశలో సాగుతున్నాయట. తమన్నా అంటే ముందు గుర్తొచ్చేది ఆమె అదిరిపోయే గ్లామర్, తర్వాత ఆమె డాన్స్! 2005లో 'చంద్ సా రోషన్ చెహరా'తో డెబ్యూ చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 85కి పైగా సినిమాల్లో నటించిన ఈ మిల్కీ బ్యూటీ... స్పెషల్ సాంగ్స్‌లో అయితే రికార్డులే సృష్టించింది. బోల్డ్ పాత్రలకి సై అంటున్న తమన్నా రాగిణి MMS 3కి ఓకే చెప్పిందనే తెలుస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్, ఓటీటీల్లో బోల్డ్ కంటెంట్ ప్రధాన ఎజెండాగా సినిమాలు తెరకెక్కుతున్నాయి. ఆ కోవలోనే వచ్చిన సినిమా 'రాగిణి MMS 2'. ఇందులో శృంగార తార సన్నీలియోన్ రెచ్చిపోయి నటించింది. కమర్షియల్‌గానూ విజయం సాధించిన ఈ మూవీ సన్నీలియోన్‌కి బాలీవుడ్‌లో మంచి బ్రేక్ ఇచ్చింది. మరి ఇప్పుడు రాగిణిగా తమన్నా ఎలా మెప్పిస్తుందో చూడాలి మరి!



# భరించలేనంత నడుము నొప్పితో

బాలీవుడ్‌లో ఇటీవల రిలీజ్ అయిన 'దే దే ప్యార్ దే 2' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. అజయ్ దేవ్‌గణ్, అయితే ఈ సీక్వెల్‌తో మరోసారి తన కామెడీ టైమింగ్ రుజువు చేసుకున్నాడు. ఈ సినిమా రకుల్ ప్రీత్ సింగ్‌కి కూడా మంచి కమ్‌బ్యాక్ ఇచ్చిందనే చెప్పాలి. అయితే ఈ సినిమా చేయడానికి తాను చాలా కష్టపడ్డానంటోంది రకుల్. ఈ సినిమా షూటింగ్‌లో విపరీతమైన నడుము నొప్పితో బాధపడ్డానని ఆ విషయం చాలా కొద్దిమందికే తెలుసంటోంది. 'దే దే ప్యార్ దే 2' షూటింగ్ సమయంలో రకుల్ నడుము కండరాలు పూర్తిగా చిరిగిపోవడం వల్ల కలిగే లెవెల్ 5 మస్కులర్ టియర్ సమస్యతో బాధపడింది. నడుము, కాళ్లలోకి కరెంటు షాక్ ఇస్తున్నట్లు నొప్పి. నడవడం కష్టం, నిలబడటం కష్టం, అయినా ఆ యాక్షన్ సీక్వెన్స్‌లు, డ్యాన్స్ సీక్వెన్స్‌లు పూర్తి చేసింది. రోజూ సెట్‌కు వచ్చేటప్పుడు MRI రిపోర్ట్‌ను జేబులో పెట్టుకొని వచ్చేదట. ఎందుకంటే.. ఎప్పుడైనా అకస్మాత్తుగా పడిపోతే డాక్టర్లకు చూపించడానికి! 'నడుము నొప్పి అంత తీవ్రంగా ఉంది కానీ నేను ఒక్కరోజు కూడా లీవ్ తీసుకోలేదు. టీమ్ మీద ఒత్తిడి పడకూడదని, ప్రొడక్షన్ లాస్ అవకూడదని భావించాను. పెయిన్‌కిల్లర్స్ వేసుకొని, ఫిజియోతో పాటు సెట్‌లోనే ట్రీట్‌మెంట్ తీసుకుంటూ షూటింగ్ పూర్తి చేశాను. రోజుకు 68 గంటలు నిలబడి యాక్షన్ చేయాలి. ఒక్కోసారి షాట్ ఓకే అనగానే నేలపైనే పడిపోయేవాళ్లం.' అంటూ తను ఎంత నొప్పిని భరించిందో చెప్పుకొచ్చింది రకుల్.

# 'పెద్ది' పోరాట సన్నివేశాల చిత్రీకరణ..



బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చేస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'పై ఉన్న అంచనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్‌కు, 'చికిరి' పాటకు వచ్చిన అద్భుతమైన స్పందన గురించి అందరికీ తెలిసిందే. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మాత.. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మకంగా సమర్పిస్తున్న 'పెద్ది'ని భారీ బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం 'పెద్ది' బృందం రామ్ చరణ్, ఇతర ఫైటర్లతో పాటు కీలకమైన, హైఇంటెన్సిటీ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తోంది. ఈ షూటింగ్‌లో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కూడా పాల్గొంటున్నారు. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా భారీ సెట్‌ను నిర్మించారు. అక్కడ ఈ భారీ యాక్షన్ బ్లాక్‌కు సంబంధించిన చిత్రీకరణ జరుగుతోంది.

బాలీవుడ్ స్టార్ విక్కీ కౌశల్ తండ్రి, ప్రముఖ స్టంట్ డైరెక్టర్ 'దంగల్' ఫేమ్ షామ్ కౌశల్ ఈ హైఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. నవకాంత్ స్టంట్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సీక్వెన్స్ సినిమాకి హైలైట్ కానుందని, అందుకే మేకర్స్ షామ్ కౌశల్‌ను సంప్రదించారు. ఈ సీక్వెన్స్‌కు సినిమాలో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అందుకే ఈ చిత్రీకరణను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు.

దర్శకుడు బుచ్చిబాబు సానా పర్ఫెక్షనిస్ట్ అన్న సంగతి తెలిసిందే. ప్రతి యాక్షన్ సెగ్మెంట్ పైనా చాలా శ్రద్ధ చూపిస్తుంటారు. ప్రతి ఫైట్ సీక్వెన్స్‌ను ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో, ఉత్కంఠభరితంగా ఉండేలా రూపొందిస్తున్నారు.

ఇక ఇప్పటికే 'పెద్ది' ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' ప్రపంచవ్యాప్తంగా 110 మిలియన్ల మార్కును దాటి వరల్డ్ వైడ్‌గా టాప్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ పాట ప్రపంచవ్యాప్తంగా ఇంకా ట్రెండ్ అవుతూనే ఉంది. అంతే కాకుండా ఈ సంవత్సరం బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ చార్ట్ బస్టర్లలో ఒకటిగా నిలిచింది. ఈ చిత్రంలో జగపతిబాబు, దివ్యేందు శర్మ కూడా ప్రముఖ పాత్రల్లో నటిస్తున్నారు. 'పెద్ది' కోసం అకాడమీ అవార్డు గ్రహీత ఎఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చూసుకుంటున్నారు.

'పెద్ది' చిత్రాన్ని మార్చి 27, 2026న గ్రాండ్‌గా పాన్‌ఇండియా వైడ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**